'కాలేజీల్లో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయింది'


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నిజాంపేట్: ఓ ప్రైవేటు కాలేజీలో విద్యార్థినిపై లైగింక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ నవ తెలంగాణ విద్యార్థి శక్తి ఆధ్వర్యంలో బాచుపల్లిలోని కాలేజీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయాలను ఫీజుల రూపంలో వసూలు చేస్తున్న యాజమన్యాలు విద్యార్థినులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. బాలికల కాలేజీలో పురుషులకు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇలాంటి సంఘటనలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్షలకు విద్యార్థినులను బస్సులో తీసుకెళ్తున్న సందర్భంగా ఓ బాలిక పట్ల ఓ అధ్యాపకుడు అసభ్యంగా ప్రవర్తించడాని ఆరోపించారు. పరీక్షల కోసం ట్రాన్స్‌పోర్టు కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న యాజమన్యాలు విద్యార్థుల సంఖ్యకు సరిపడ సీట్లు ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. అయితే ఈ విషయంపై బాచుపల్లి సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా ఎవరి నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. ఒక వేళ ఫిర్యాదు చేస్తే సంబంధింత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్: మహా శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని జీడిమెట్ల గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జాతరకు సంబంధించి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 8న ఉదయం 4 గంటలకు స్వామివారికి గంగా స్నానం, రాత్రి 7 గంటలకు సంస్కృతిక కార్యక్రమాలు, 9న మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, 2గంటలకు అగ్ని గుండాలు, బోనాల సమర్పణ, గొర్రెపోతుల బండి ఊరేగింపు, గొలుసులు తెంపుట, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ పేర్కొంది.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

సుభాష్‌నగర్: సాయిలత మోడల్ స్కూల్ వార్షికోత్సవం మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, జీడిమెట్ల సీఐ శ్రీనివాస రావులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దయాకర్, కరస్పాండెంట్ అర్చన, ట్రిస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, చైర్మన్ శివయ్య, సభ్యులు వరప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

జీరో 0 బిల్ రాలేదు!

కానీ మా పొరుగు ఇంటి వారికి వచ్చింది!


సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పలు ప్రాంతాల ప్రజలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ విషయం ఇప్పుడు గందరగోళాన్ని సృష్టిస్తోంది. పలు కాలనీల ప్రజలు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల కార్యాలయాలకు తమకు జీరో బిల్ రాలేదని వాపోతూ అధికారులను కలిసి విన్నవిస్తూ తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిమెట్ల, కూకట్‌పల్లి, మేడ్చల్ సబ్ డివిజన్ల పరిధిలో మొత్తం 98,495 కనెక్షన్లకు గృహ జ్యోతి కింద 200యూనిట్లకు తక్కువ వాడితే వారికి జీరో ఇస్తూ వచ్చారు. అయితే ఆయా ప్రాంతాల్లో ప్రజా పాలన కింద పెట్టుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ తమకు విద్యుత్ బిల్లులో యథావిధిగా వచ్చాయని ఆరోపిస్తూ పలువురు జంట సర్కిళ్లతో పాటు కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.
- 70 యూనిట్లు వినియోగించిన తనకు బిల్లు వచ్చిందని, పక్కింట్లో ఉన్నవారికి మాత్రం జీరో బిల్లు వచ్చిందని ఇదెక్కడి అన్యాయం అని వాపోతున్నారు. అధికారులు మాత్రం తమకు ఆదేశాలు రాలేదు. వచ్చిన తర్వాత చూద్దాం.. వెళ్లి రండి అంటూ.. సమాధానం చెప్పడం విశేషం.

దరఖాస్తు చేసుకున్నా బిల్లు వచ్చింది



కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జయరాం నగర్‌లో ఉండే శివమ్మ ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోగా ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తయింది. విద్యుత్తు మీటర్ రీడర్ సిబ్బంది సైతం వచ్చి విచారణ చేపట్టారు. అయినా కరెంట్ బిల్లు కట్టమని ఇచ్చారు. జీరో బిల్లు ఇవ్వలేదు. ఇదే విషయాన్ని అడిగేందుకు కార్యాలయానికి వస్తే సమాధానం చెప్పే వారే లేరు.

– శివమ్మ, జయరాంనగర్

అధికారులకు చెప్పకోమని వెళ్లిపోయారు



సంతోష్‌నగర్ ప్రాంతానికి చెందిన ఆండాలు రామ్ లీలా మైదానంలో జరిగిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న. విద్యుత్ అధికారులు మాత్రం బిల్లులు కట్టాలని ఇవ్వడంతో ఒకసారిగా అవాక్కయ్యాను. ఇంటి పక్కనే ఉన్న వారికి జీరో బిల్లు ఇచ్చి తనకెందుకు ఇవ్వడం లేదని మీటర్ రీడర్‌ను నిలదీస్తే కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసుకో అని వెళ్లిపోయాడన్నారు.

– ఆండాలు, సంతోష్‌నగర్

ఇంకా గైడ్‌లైన్స్ రాలేదు



ఇంకా పైనుంచి ఆదేశాలు రాలేదు. పూర్తి గైడ్‌లైన్స్ వచ్చిన తర్వాతనే తదుపరి ప్రక్రియ ఉంటుంది. చాలా మంది ప్రజలు తెలియక కార్యాలయానికి వచ్చి అడిగి వెళ్తున్నారు. ఏదైనా ఉన్నతాధికారుల నుంచి సమాచారం రాగానే పత్రిక ద్వారా ప్రకటన చేస్తామని అంతవరకు ప్రజలు ఓపికగా ఉండాలని సూచించారు.

– నరసింహ, ఉపకమిషనర్, కుత్బుల్లాపూర్

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతా

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని కార్పొరేటర్ జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో మంగళవారం రూ.56లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొని వస్తే వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అంకిత్, డివిజన్ ప్రెసిడెంట్ అశోక్, అంజయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, దాసు, విట్టల్, యాదగిరి, బ్రహ్మానందచారి, హనుమంతు, మనోజ్ తదితరలు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం

కుత్బుల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారి ప్రధాని మోదీ నేతృత్వంలో అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివాహాది శుభకార్యాలు, పూజా క్యాక్రమాలకు రావాలని శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తాం

కుత్బుల్లాపూర్: ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువై శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను మంగళవారం పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌స్పెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా విజయవర్ధన్ మాట్లాడుతూ.. సంక్షేమ సంఘాల ప్రతినిధులు పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు విషయంలో చొరవ తీసుకోవాలని సూచించారు.

మహిళలు లేనిదే మానవ మనుగడ లేదు

మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద్


మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మహిళలు లేనిదే మానవ మనుగడ లేదని... నేడు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీ సాయికృపా అపార్ట్‌మెంట్స్‌లో కౌన్సిలర్ మాడంశెట్టి సువర్ణకృష్ణసాగర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తల్లిదండ్రులను తమ పిల్లలను సమభావంతో పెంచాలన్నారు. ఆడ పిల్లలకు ఉత్తమ విద్యనందించి వారు తమ కాళ్లపై నిలబడేలా ప్రోత్సహించాలన్నారు. నేడు విద్యా, వైద్యం, రాజకీయాలు, కళలు, క్రీడల్లో మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పలువురు మహిళలను ఎమ్మెల్యే శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా కౌన్సిలర్లు శ్రీవిద్య, సరిత, కో–ఆప్షన్ సభ్యులు మంగమ్మ, బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు సంగీతారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కౌన్సిలర్లు సన్న రవి, కొంపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.58కోట్లతో డీసిల్టింగ్ పనులు

- కుత్బుల్లాపూర్ ఈఈ కృష్ణచైతన్య
- 32 కి.మీ మేర నాలాల్లోని పూడిక తీస్తాం
- ఇప్పటికే 20శాతం పూర్తి
- జూన్‌లోపు మిగిలిన పనులు పూర్తి చేస్తామని వెల్లడి



జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో డీసిల్టింగ్ పనులు ప్రారంభమయ్యాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో రూ.75 లక్షలు, గాజులరామారం సర్కిల్‌లో రూ.83 లక్షలతో ఈ పనులను చేపడుతున్నట్లు కుత్బుల్లాపూర్ ఈఈ కృష్ణచైతన్య తెలిపారు. మొత్తం 32 కిలోమీటర్ల మేర నాలాల్లోని పూడికను తీస్తారని అధికారులు పేర్కొన్నారు. వచ్చే వానాకాలం దృష్టిలో పెట్టుకొని నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి వర్షం నీరు సాఫీగా వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మెకానికల్, మ్యాన్యువల్, బకెట్ క్లీనింగ్‌లతో ఈ పనులను చేపట్టనున్నారు. జూన్ లోపు ఈ పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళికను రూపొందించారు. సంవత్సరం పొడవున ఈ ప్రక్రియ కొనసాగే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే 20 శాతం పనులను పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని దశలవారీగా పనులు పూర్తిచేస్తామని తెలిపారు.



జైగౌడ్ ఉద్యమ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వెంకటేశ్‌గౌడ్

చింతల్: జైగౌడ్ ఉద్యమ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన బీసు వెంకటేశ్‌గౌడ్ నియమితులయ్యారు. బుధవారం జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ప్లీనరీలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కులవృత్తి, గౌడుల సమస్యలు, వివిధ అంశాలపై చర్చ జరిగింది. జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా గుంద్రాతి నారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మునుకుంట్ల శ్రీనివాస్‌గౌడ్, యూత్ రాష్ట్ర అధ్యక్షుడిగా బొమ్మగాని శంకర్ గౌడ్‌లను నియమించారు.

ఇన్‌స్పెక్టర్‌కు వీడ్కోలు

సుభాష్‌నగర్: సూరారం పోలీస్‌స్టేషన్ మొట్టమొదటి ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. 8 నెలల తర్వాత కేపీహెచ్‌బీ పీఎస్‌కు బదిలీ అయ్యారు. దీంతో మంగళవారం స్టేషన్ ఆవరణలో సిబ్బంది, స్థానికులు ఆయనను సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు నారాయణ సింగ్, వెంకటేష్, మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నేడు బీఆర్‌ఎస్ నిరసన కార్యక్రమాలు

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎల్ ఆర్‌ఎస్ పథకాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 10.30 గంటలకు కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, కో.ఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మేయర్ కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు

జగద్గిరిగుట్ట: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయాలు ముస్తాబయ్యాయి. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీమల్లికార్జున భ్రమరాంబిక కేతమ్మ, శివ పంచాయతన ఆలయం, శ్రీరాంనగర్‌లోని శివ మార్కండేయస్వామి వారి దేవాలయల వద్ద ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశాం

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ కైసర్ నగర్ కమిటీహాల్‌లో ఓం మణికంఠ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'అభినందన సభ' కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయీ బ్రహ్మణుల అభ్యున్నతికి గతంలో తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. సెలూన్‌లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, మక్సూద్, ఎల్లాగౌడ్, కుత్బుల్లాపూర్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయీ, ప్రధాన కార్యదర్శి వీఎస్‌ఆర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్థల వివాదం

- 20రోజుల క్రితం కౌన్సిలర్‌పై ఓ వ్యక్తి ఫిర్యాదు
- ఫిర్యాదు చేసిన వ్యక్తిపై మరో వ్యక్తి ఫిర్యాదు
- కౌన్సిలర్‌తో పాటు పలువురిపై కేసు నమోదు

దుండిగల్: ఓ ప్రైవేట్ స్థలం వివాదంలో గతంలో ఓ కౌన్సిలర్‌పై కేసు నమోదు కాగా తాజాగా మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి సందయ్యకుంట సర్వే నం.62,63 కొంత మందికి స్థలాలు ఉన్నాయి. సర్వే నం. 62లో షేక్ సర్దార్‌కు 236 గజాలు, సర్వే నం.63లో ప్రవీణ్ పటేల్‌కు 2వేల గజాల స్థలాలు ఉన్నాయి. వీరి మధ్య సరిహద్దు గొడవలు జరుగుతున్నాయి.

- కాగా రెండు రోజుల క్రితం ప్రవీణ్ పటేల్ తన మనషులతో కలిసి వచ్చి తన స్థలంలోని ప్రహరీని జేసీబీతో కూల్చి వేశాడని.. అడ్డుకోబోయిన తనపై దౌర్జన్యంగా వ్యవహరించి భయభ్రాంతులకు గురి చేశాడని షేక్ సర్దార్ దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రవీణ్ పటేల్, చేతన్ పటేల్, శైలేందర్‌లతో పాటు మరి కొందరిపై 447, 427, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.
- ఇదే స్థల వివాదంలో 20 రోజుల క్రితం స్థానిక కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ తన స్థలంలోకి అక్రమంగా ప్రవేశించాడని ప్రవీణ్ పటేల్ ఫిర్యాదు చేయగా కౌన్సిలర్ సత్యనారాయణపై సైతం అవే సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో సదరు స్థలం వివాదంలో పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువురిపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వేతన ఒప్పందం జరిగేలా కృషి చేస్తా

అబ్దుల్ ఖాదర్



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ పారిశ్రామికవాడలోని యూరోఫ్లెక్స్ ట్రాన్స్‌మిషన్ పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడిగా అబ్దుల్ ఖాదర్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ నుంచి అధ్యక్ష పదవికి పోటీ చేసిన అబ్దుల్ ఖాదర్‌కు 131 ఓట్లు రాగా ప్రత్యర్థి బీఆర్‌టీయూకు చెందిన రాంబాబు యాదవ్‌కు 75 ఓట్లు పడ్డాయి. దీంతో అబ్దుల్ ఖాదర్ 56 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఐఎన్‌టీయూసీ నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయకుమార్, సెక్రటరీగా ఆంజనేయ రెడ్డి, కమిటీ సభ్యులుగా మోహన్‌రెడ్డి, కిషోర్, మద్దిలేటి రెడ్డి, అడ్డాల సతీష్, నాగరాజు, కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో మెరుగైన వేతన ఒప్పందం జరిగేలా కృషి చేస్తానన్నారు.



వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


పరిమళ (ఫైల్)


రెడ్డప్ప (ఫైల్)

దుండిగల్: ఇంటి నుంచి వెళ్లిన గృహిణి అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ ప్రాంతానికి చెందిన అజ్మీర్ సుధాకర్, పరిమళ(30) భార్యాభర్తలు. సుధాకర్ ఆన్‌లైన్ వ్యాపారం చేస్తుండగా పరిమళ గృహిణి. కాగా ఈనెల 1వ తేదీన పరిమళ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సుధాకర్ దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో..

డబ్బు తీసుకుని మెటీరియల్ కొనుగోలు చేసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డి.పోచంపల్లి ఇందిరానగర్ కాలనీకి చెందిన తోట రెడ్డయ్య(53) తన కుమారుడు కుమారస్వామితో కలిసి స్థానికంగా వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. కాగా ఫిబ్రవరి 15వ తేదీన తండ్రి కొడుకులు చర్చిగాగిల్లాపూర్‌లో షటర్ బిగించేందుకు వెళ్లారు. అక్కడి నుంచి రెడ్డయ్య రూ.95 వేలు తీసుకుని ఇనుప సామాన్లు కొనుగోలు చేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుమారస్వామి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం

నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్


అంబీర్ చెరువు వద్ద వాకర్స్‌తో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్

నిజాంపేట్: చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. మంగళవారం ప్రగతి నగర అంబీర్ చెరువును కార్పొరేటర్ సురేష్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు వాకర్లు నడక దారి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ధన్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ.. చెరువుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. ఈ విషయాన్ని మేయర్ నీలారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. త్వరలోనే చెరువు చుట్టూ నడకదారిని ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక ప్రజలు కుటుంబంతో సహ సేదతీరేందుకు పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి

దుండిగల్: స్థానికంగా నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, సర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట ల్యాండ్ మార్క్–2లో కాలనీవాసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గత వర్షాకాలంలో కురిసిన వార్షాలకు కాలనీ నీట మునిగిందని, వర్షపు నీరు బయటకు తరలించేందుకు నూతన డ్రైనేజీను నిర్మించాలని స్థానికులు కోరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, చైర్ పర్సన్‌ల సహకారంతో శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ స్థలం కబ్జా!

- కనుమరుగవుతున్న ప్రభుత్వ స్థలాలు
- గతంలో అక్రమ నిర్మాణాలను మూడుసార్లు కూల్చిన అధికారులు
- అధికారులు బదిలీ కాగానే మళ్లీ కబ్జా చేస్తున్న అక్రమార్కులు


2019లో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో బేస్‌మెంట్లను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది



సుభాష్‌నగర్: గాజులరామారం గ్రామం ఇందిరమ్మకాలనీ ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 13లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ స్థలం ఉంది. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవ్వడంతో సదరు స్థలాన్ని కాపాడాలని 2019లో 'సాక్షి' ప్రత్యేక కథనం ఇచ్చింది. స్పందించిన అప్పటి తహసీల్దార్ గౌతమ్‌కుమార్ సదరు స్థలం కబ్జా కాకుండా రూ.2లక్షల విలువ చేసే మొక్కలను నాటించారు. ఆయన బదిలీ అనంతరం క్రమేణ కబ్జారాయుళ్ల కన్ను సదరు స్థలంపై పడింది. ఇంకేముంది ఉన్నది పూడ్చిపెట్టారు. ప్రస్తుతం అరకొరగా ఉన్న స్థలాన్ని కాజేసేందుకు భీష్మించి కూర్చున్నారు. వారం వ్యవధిలో ప్రభుత్వ స్థలంలో వెలసిన గదిని మూడుసార్లు రెవెన్యూ అధికారులు కూల్చివేసిన కబ్జారాయుళ్లు మాత్రం తగ్గడం లేదు.

వారంలో మూడుసార్లు కూల్చివేత....

వారం క్రితం ప్రభుత్వ స్థలంలో గుట్టు చప్పుడు కాకుండా రాత్రి రాత్రికి ఓ గదిని ఏర్పాటు చేయగా స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ఇలా ఇప్పటికీ మూడుసార్లు రెవెన్యూ సిబ్బంది కూల్చారు. ప్రస్తుతం రెండు రోజుల నుంచి రాత్రి వేళలో మట్టి పోస్తున్నారు. సదరు స్థలం చుట్టూ బస్తీలు, కాలనీలు రావడంతో జనాభా అదే స్థాయిలో పెరిగింది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు.

ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయిస్తాం



ఇక్కడ ప్రభుత్వ స్థలం కబ్జా అవుతుందని తమ దృష్టికి రావడంతో సిబ్బందిని పంపించి నిర్మాణాన్ని తొలగించాం. దీని వెనకాల సూత్రధారులు ఎవరో గుర్తించి చర్యలు చేపడతాం. ఇప్పటికే ఆర్‌ఐకి సదరు వ్యక్తులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయాలని ఆదేశించాం. సదరు స్థలాన్ని తాను సందర్శించి తగు చర్యలు చేపడతాను.

– రెహమాన్‌ఖాన్, తహసీల్దార్ కుత్బుల్లాపూర్

ప్రజా సంక్షేమమే మా ధ్యేయం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్: తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిదులు ఎమ్మెల్సీని కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఏకరవు పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ స్థానిక అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అధికారులు సైతం ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.